క్లుప్తంగా

ముగిసిన శిక్షణా శిబిరం



శిక్షణ ముగించుకున్న బాల్‌బ్యాడ్మింటన్ జట్టును అభినందిస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : ఏఐటీఎస్‌లో ఈనెల 14 నుంచి ప్రారంభమైన బాల్ బ్యాడ్మింటన్ బాలికల టీం శిక్షణా శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు విజయం తమ సత్తా చాటి జేఎన్‌టీయూ – ఏ యూనివర్సిటీకి, ఏఐటీఎస్‌కు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఫిజికల్ డైరెక్టర్ డా.బి.నాగముని మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 25 వరకు తమిళనాడులోని దిండిగల్‌లో బాల్ బ్యాడ్మింట్ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.నారాయణ, ఏఐటీఎస్ పరిపాలనాధికారి నూకా సుబ్బారెడ్డి, అసిస్టెంట్ ఫిజికల్ డైరక్టరు సైపుల్లా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లి రెవెన్యూ గ్రామ పరిధి బొగ్గిడివారిపల్లి పంచాయతీలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఓ రేణుక మాట్లాడుతూ బొగ్గిడివారిపల్లి పంచాయతీలోని సర్వే నెంబర్ 870లో ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తహసీల్దారు మురాషావలి ఆదేశాల మేరకు తొలగించామన్నారు. కొంతమంది స్థానికేతరులు స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు జరుపుతున్నారన్న ఫిర్యాదుతో అధికారులు అక్కడికి వెళ్లి అక్రమ కట్టడాలను కూల్చివేశారు. అనంతరం ప్రభుత్వ స్థలంలో వీఆర్‌ఓ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలి వైఎస్సార్ సర్కిల్ వద్ద నేడు బుధవారం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హాజరై పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారన్నారు. మండలంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కట్టుదిట్టంగా పది పరీక్షలు



దేవపట్లలోని గురుకుల పాఠశాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

సంబేపల్లె : మండలంలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు కట్టుదిట్టంగా నిర్వహించినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. పరీక్ష కేంద్రాలలో 144 సెక్షన్‌లు అమలు పరిచామన్నారు. అలానే ఎవరైనా మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అభయాంజనేయుడికి పూజలు



అలంకరణలో అభయాంజనేయస్వామి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని గాండ్లవీధి, టోల్‌గేట్ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో స్వాములవారికి అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

'గ్రూప్ -1 పరీక్షలో తెలుగు విద్యార్థులకు అన్యాయం'

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఏపీపీఎస్సీ గ్రూప్-1 ప్రాథమిక పరీక్షలో తెలుగు విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.సురేష్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 ప్రాథమిక పరీక్ష మార్చి 17న జరిగిందన్నారు. తెలుగు, ఇంగ్లిష్ రెండు కలిపి ఏపీపీఎస్సీ కొత్తగా ప్రవేశపెట్టిన ప్రశ్నాపత్రంలో అనువాద దోషాలతో అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ప్రశ్నపత్రం విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లతో, విషయ నిపుణులతో తయారు చేయిస్తున్నారా? అన్న అనుమానం కలుగుతోందని తెలియజేశారు.

ఓటు ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం

- పోలింగ్ శాతం పెరిగేలా అవగాహన
- 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదవ్వండి
- ప్రతి గ్రామంలో ఓటరు అవగాహన సదస్సులు



రామాపురం: ఓటు హక్కుపై ర్యాలీ చేస్తున్న అధికారులు



చిట్వేలి: అవగాహన ర్యాలీలో అధికారులు, అంగన్‌వాడీలు తదితరులు



లక్కిరెడ్డిపల్లె: మానవహారంగా నిలుచున్న అధికారులు, సిబ్బంది

పెనగలూరు (ఓబులవారిపల్లె): ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం లాంటిదని తహసీల్దార్ ఇంద్రాణి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బందితో ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేటట్లు చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇక్కడకు వచ్చిన ప్రతి ఒక్కరూ మీ గ్రామాలలో ప్రతి ఒక్కరినీ ఓటుహక్కు వినియోగించుకునే విధంగా చర్యలు తసుకోవాలని తెలియజేశారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారిని పిలిపించి ఓటు వేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం బస్టాండ్ కూడలిలో భారీ ర్యాలీ నిర్వహించారు. తదుపరి వైఎస్సార్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఏపీఎం నిరంజన్, ఎస్‌ఐ మల్లికార్జున, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, వెలుగు సిబ్బంది శివ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో

చిట్వేలి : అర్హత కల్గిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ జ్ఞానేశ్వరి సూచించారు. మంగళవారం ఎంపీడీఓ రంగారావుతో కలిసి ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కొత్తగా ఓటు హక్కు కోసం ఫారం – 6 ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్రకళ, ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరి, ఎంఈఓ కోదండనాయుడు, వీఆర్‌ఓ భుజంగరావు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి'

రామాపురం : ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీఓ ప్రభాకర్, తహసీల్దార్ శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం దేవసేనలు పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వెలుగు కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతా కేంద్రంలో శిక్షణా కార్యాక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వెలుగు కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి యువతీ యువకులు ఏప్రిల్ 15వ తేదీలోపు ఓటురుగా నమోదవ్వాలని చెప్పారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది వంటిదన్నారు. రాబోవు ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీ మధుకర్, మండల యాంకర్ వెంకట్రామిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, సుజాత, హుస్సేనమ్మ, యానిమేటర్లు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం నిర్వాహకులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : ప్రతి పౌరుడు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ కుమారస్వామి పేర్కొన్నారు. ఓటర్లపై అవగాహన కార్యక్రమంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి మూడురోడ్ల కూడలిలో మానవహారంగా నిలుచున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఓటుహక్కుపై ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఏపీఎం నిరంజన్, డీటీ రెడ్డన్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోండి

ఓబులవారిపల్లె : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కుల్లాయిస్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది ఓటుహక్కు అని అన్నారు. ఓటుహక్కును వినియోగించుకొని ప్రభుత్వ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని తెలియజేశారు. అనంతరం రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పీర్‌మున్నీ, ఏపీఎం అర్ముగం, ఈఓపీఆర్‌డీ రామ్మోహన్, వీఆర్‌ఓ హరి, అంగన్‌వాడీ టీచర్లు, వెలుగు సీసీలు తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన పెంచాలని పుల్లంపేట తహసీల్దారు వెంకటనారాయణ, ఎంపీడీఓ నరసింహ మూర్తి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని ఓటింగ్ శాతం పెంచాలన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వారు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నవీన్‌కుమార్, వీఆర్‌ఓ సోమశేఖర్‌రెడ్డి, దానమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



పుల్లంపేట మండల కేంద్రంలో..



ఓబులవారిపల్లెలో ఓటరు అవగాహన ర్యాలీ



పెనగలూరులో మానవహారంగా నిలుచున్న దృశ్యం

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

చిట్వేలి : ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని రాజంపేట డీఎస్పీ చైతన్య ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం సి.కందులవారిపల్లి పంచాయతీ తుమ్మచెట్లపల్లి, హరిజనవాడ, ఎస్టీ కాలనీలలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన, కేంద్ర పోలీస్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు సీఐ సురేంద్రనాథ్ రెడ్డి, వీఆర్‌ఓ లీలారాణి, తహసీల్దార్ జ్ఞానేశ్వరి, ఎస్‌ఐ సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అధికారులకు పట్టదా!

పుల్లంపేట : దేశవ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చి మూడు రోజులు అయినప్పటికీ కొన్ని ప్రాంతాలలో తెలుగుదేశం పార్టీకి సంబంధించిన వాల్‌పోస్టర్లు యథేచ్ఛగా దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు వాటిని తొలగించడంలో విఫలమయ్యారని పలువురు అభిప్రాయపడుతున్నారు. కడప – చెన్నై జాతీయ రహదారి సమీపంలో, పుల్లంపేట మోడల్ స్కూల్ వద్ద తెలుగుదేశం పార్టీకి చెందిన వాల్‌పోస్టర్లు తొలగించడంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పోస్టర్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



జాతీయ రహదారి పక్కనే దర్శనమిస్తున్న టీడీపీ పోస్టర్లు

మేమంతా కొరముట్ల వెంటే



ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులును సన్మానిస్తున్న వడ్డిపల్లె గ్రామ యూత్ సభ్యులు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు వెంటే మేమంతా నడుస్తామని మంగళవారం పట్టణానికి చెందిన వడ్డిపల్లె యూత్ సభ్యులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులను వారు ఘనంగా సన్మానించి రాబోయే ఎన్నికల్లో కొరముట్ల విజయానికి పని చేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరత్నాల ద్వారా తమ కుటుంబాలు ఎంతో లబ్ధి పొందాయని, సీసీ రోడ్డుకు కూడా నోచుకోని వడ్డిపల్లెలో అన్ని వీధుల్లో రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించిన కొరముట్లకు రుణపడి ఉంటామన్నారు. ఆసరా, చేయూత, అమ్మ ఒడి, సున్నా వడ్డీ వంటి అనేక పథకాలు తమ కుటుంబాలకు అందడంతో సంతోషంగా ఉన్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హేహ నవర్మ, ఉప సర్పంచ్ తోట సాయి, సుధాకర్‌రాజు, సిద్ధయ్య, గణేష్, ప్రసాద్, శివ, గోపి, మోహన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్య కొండకు నిప్పు

కురబలకోట : మండలంలోని అంగళ్లు మల్లయ్య కొండకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. చూస్తుండగానే కొండంతా కాలిపోయింది. పచ్చదనం కాలిపోయి నల్లగా మారింది. జీవాల పచ్చి మేత కోసం గుర్తు తెలియని వారు నిప్పంటించి ఉండవచ్చని భావిస్తున్నారు.



అంగళ్లు మల్లయ్య కొండపై చెలరేగుతున్న మంటలు

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్టాపన

గాలివీడు : మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలో వెలసిన పురాతన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో గణపతి పూజ, ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించి, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కార్యక్రమాన్ని వైభవోపేతంగా జరిపారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నప్రసాదాల వితరణ గావించారు. కాగా బుధవారం (నేడు) ఉదయం ప్రాణప్రతిష్ట, కల్యాణోత్సవం అనంతరం మధ్యాహ్నం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులతో కోలాటాలు, బృందావనం వివిధ దేవతామూర్తుల వేషధారణలతో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు, గ్రామస్తులు, ఈఓ కొండారెడ్డిలు తెలిపారు.



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించిన దృశ్యం

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండాలి

మండలంలో పలు పోలింగ్ బూత్‌లను తనిఖీ చేసిన ఆర్డీఓ రంగస్వామి

చిన్నమండెం : మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ డివిజనల్ అధికారి రంగస్వామి మంగళవారం పరిశీలించారు. మండలంలోని చాకిబండ, మల్లూరు, చిన్నమండెం, కేశాపురంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో గల మౌలిక వసతులపై ఆరా తీసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఆనంద్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ రంగస్వామి

సీఎంగా జగనన్నకు మరో అవకాశం ఇవ్వండి

కేవీపల్లె : మరింత అభివృద్ధి, సంక్షేమం ఆకాంక్షిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వడ్లకుంట పంచాయతీ మంచాలమందలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ వంద శాతం అమలు చేసి మాటమీద నిలబడిన వ్యక్తిగా పేరొందారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైపు ధర్మం, న్యాయం ఉన్నాయని, జగన్‌కు ప్రజలందరూ అండగా నివాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షనేత చంద్రబాబుది రాజకీయమంతా మోసం, దగాలతో కూడుకున్నదని, ఎలాగైనా గెలవాలని నోటికొచ్చిన హామీలు ఇస్తున్నారని తెలిపారు. ప్రజలు మోసపోరాదని, చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ రెడ్డిమోహన్‌రెడ్డి, సర్పంచ్ వారాదమ్మ, నాయకులు శీన్‌రెడ్డి, యర్రమరెడ్డి, చిన్నపరెడ్డిలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

పట్టుదల, ఆత్మవిశ్వాసంతో చదివితే ఉద్యోగాలు

కురబలకోట : పట్టుదల, ఆత్మ విశ్వాసం ..సరైన ప్రణాళిక ఆపై స్కిల్స్‌తో పాటు నైపుణ్యం సాధిస్తే ఎక్కువ జీతంతో కోరుకున్న ఉద్యోగాలు లభిస్తాయని స్మార్ట్ బ్రిడ్జ్ కంపెనీ డైరెక్టర్ యుక్తేష్ చింతమడక అన్నారు. మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కేరీర్ రెడీనెస్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ వేతనంతో కూడిన మంచి ఉద్యోగం కావాలని అందరూ ఆశిస్తారన్నారు. ఆశించే జీతం రావాలంటే అందుకు తగ్గ శ్రమ అవసరమన్నారు. చదువుకు ప్రతిఫలం ఉద్యోగమన్నారు. ఇది సరికొత్త జీవితానికి నాంది అన్నారు. చదువు పూర్తి చేసుకోవడం ఒక ఎత్తయితే మంచి ఉద్యోగం సాధించడం ఈ రోజుల్లో సవాల్‌గా మారిందన్నారు. అయితే ఇవి కొందరికే సాధ్యమవుతున్నాయన్నారు. ముఖ్యంగా కేరీర్ ప్లానింగ్, సబ్జక్టుపై పట్టు, సాంకేతిక పరిజ్ఞానం, ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావడం, క్రమశిక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుక్తేష్

అంగన్‌వాడి.. మెరుగుబడి

- శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడి..
- రూ.9 లక్షలతో రూపురేఖలు మార్చిన ఎమ్మెల్యే, వైస్ ఎంపీపీలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రాఘవరాజాపురం గ్రామస్తులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజపురం పంచాయతీ కాపుపల్లెలో దశాబ్దాలుగా అంగన్‌వాడి కేంద్రానికి భవనం లేక చిన్నపిల్లలు ఇబ్బందులు పడేవారు. గ్రామస్తులు గత ప్రభుత్వాలకు, నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోయింది. 1999 సంవత్సరంలో నిర్మాణ పనులు మొదులు పెట్టి అర్థాంతరంగా ఆపేశారు. 23 ఏళ్లుగా నేటి వరకు అలాగే శిథిలమై మొండిగోడలతో ఉండేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక స్థానిక యువకులు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డికి తెలియజేయడంతో ప్రభుత్వ విప్ కొరముట్ల ఆదేశాలతో రూ.5లక్షల నిధులతో త్వరితగతిన అంగన్‌వాడి భవనాన్ని సర్వాంగ సుందరంగా మండలంలో ఎక్కడా లేని విధంగా తీర్చిదిద్దారు. ఈ నెల 9న ఎమ్మెల్యే, వైస్ ఎంపీపీలు అంగన్‌వాడి కేంద్రాన్ని ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు, చిన్నపిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వానికి, పాలకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



నాడు మొండి గోడలతో ఉన్న అంగన్‌వాడి భవనం



నేడు సర్వాంగ సుందరంగా మారిన దృశ్యం

ఆనందంగా ఉంది



ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అంగన్‌వాడి భవనం పూర్తవడం ఆనందంగా ఉంది. పిల్లలకు సౌకర్యవంతంగా ఉండేలా అన్ని రకాల చర్యలు చేపట్టారు. గర్భిణులు, చిన్నారుల సంరక్షణలో అంగన్‌వాడిలు కీలకం. అంగన్‌వాడీకి మరమ్మతులు చేపట్టాలని నాయకులకు విజ్ఞప్తి చేసిన వెంటనే పనులకు శ్రీకారం చుట్టి పూర్తి చేయడం హర్షణీయం.

– సరస్వతి, అంగన్‌వాడి టీచర్, రాఘవరాజపురం

గ్రామాభివృద్ధిలో సహకారం



గ్రామాభివృద్ధిలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డిలు తమకు పూర్తి సహకారం అందిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయి. చిన్నారుల కోసం అంగన్‌వాడి స్కూల్‌ను నిర్మించడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుండనటానికి ఇదే నిదర్శనం.

– బైరెడ్డి అనీల్‌కుమార్‌రెడ్డి, గ్రామస్తుడు, రాఘవరాజపురం

వైభవంగా తిరుచ్చి ఉత్సవం

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో తిరుచ్చి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు మంగళవారం ఉదయాన్నే మూలమూర్తులకు శుద్ధి తోమాల సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ఊంజల్‌సేవ, తిరుచ్చిలో స్వామివారికి అలంకరణ చేశారు. అనంతరం స్నపన తిరమంజనం జరిగాక స్వామివారు పెద్దశేషవాహనంపై కొలువుదీరి గ్రామ పురవీధుల గుండా రంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం : స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో మంగళవారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతోసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సాంప్రదాయబద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. చివరగా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలతో కల్యాణోత్సవం నిర్వహించారు.